





# నను పాలింపగ నడిచీ వచ్చితివా!

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడాయన. ఈ భూమండలానికే అధిపతి. మరి ఆయన ఈ విశాల విశ్వంలో ఎక్కడ కాలుపెడితే ఎవరు కాదంటారు? ఆఖరికి తలపై కాలుపెడతానంటే బలిచక్రవర్తి కూడా కాదనలేదు.

అయినా కూడా, ఈ కలియుగంలో, ఒక్కో రూపంలో ఒక్కో దగ్గర స్థిర నివాస నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. తనను నమ్ముకున్నవారిని తన దగ్గరకే రప్పించుకుని,వరములొసగే వసుదైకమూర్తి ఆయన.

అయినా కూడా... పాలకడలిలోవున్నా, పుణ్యక్షేత్రాన వున్నా లేచి కదలి వచ్చేది ఒక్క సందర్భంలోనే 'కావవే వరదా...' అని భక్తుడు ప్రార్థించినప్పుడు.

అప్పుడు మాత్రం 'సిరికించెప్పడు...శంఖు చక్రములు చేదోయి సంధింపడు...' అలా పరుగుపరుగున





వచ్చేస్తాడంతే. కానీ ఇన్నాళ్ళకు, ఈ కలియుగంలో, ఈ ఆధునిక కాలంలో, ఈ ఉరుకులు పరుగుల జీవన యానంలో, మరొక సందర్భం ఒకటి ఇప్పుడు వచ్చి చేరింది భగవంతుడు భక్తుల చెంతకు రావడానికి... అదే జనం నడుమ జగదభిరాముని కళ్యాణం.

## శ్రీరాముని దయచేతన్

శ్రీ మహావిష్ణువే త్రేతాయుగాన శ్రీరామునిగా జన్మించి మానవుడు ఆచరించవలసిన ధర్మాలన్నింటినీ తాను ఆచరించి చూపి ఆదర్శప్రాయుడైనాడు సకల గుణాభిరాముడు శ్రీరాముడు.

తన తరువాత తన సోదరులకు, వారి కుమారులకు రాజ్యాన్ని పంచి ఇచ్చిన శ్రీరాముని భాతృప్రేమ ఎన లేనిది. వశిష్టుడు విశ్వామిత్రుల వంటి బ్రహ్మర్షుల పైనున్న గురుభక్తి అనన్యమైనది. శివధనుర్భంగం కూడా గురు అనుమతితోనే జరిగింది.

బహుభార్యత్వం కలిగిన వ్యవస్థ వున్న ఆ రోజుల్లో ఒకే భార్య కలిగి వుండాలనేది ఒక వ్రతంగా ఆచరించి చూపిన ఆదర్శపురుషుడు శ్రీరాముడు.

శ్రీ మద్రామాయణానికి దీర్ఘ శరణాగతి అని పేరు. ఎటువంటివాడైనా ఎంతటి శత్రువైనా శరణు వేడితే వారికి అభయమిచ్చే వాత్సల్యమూర్తి ఆయన.

అందుకే ఇప్పటికీ, ఎప్పటికీ రామరాజ్యమే కావాలని కోరుకుంటుంటారు. తండ్రి రామయ్య, తల్లి సీతమ్మ, ఈ ఆదర్శ దంపతుల కళ్యాణం జీవితంలో ఒక్కసారి తిలకిస్తే చాలట. ఏకంగా మోక్షమే లభిస్తుందట.

అటువంటి జగములేలే స్వామికి నిత్యకళ్యాణం పచ్చతోరణం. ఆయన ఆలయానికి తోరణం కట్టని రోజుండదు... డోలు సన్నాయి మోగని కాలముండదు. అయితే ఈ కళ్యాణాన్ని వీక్షించాలంటే ఆయా పుణ్య క్షేత్రాలకు వెళ్ళాల్సిందే.

ఇక ఈ నిత్యకళ్యాణాల సంగతి పక్కనపెట్టి వార్షిక కళ్యాణం సంగతి చూస్తే, అన్ని విధాల ప్రశస్తి పొంది నది శ్రీ సీతారాముల కళ్యాణం.

భారతీయ వివాహ సంస్కృతికి ఆదర్శప్రాయమయి నది, ప్రతి శుభలేఖలోనూ, ప్రస్తావనకు వచ్చేది, ప్రభుత్వం నుంచి లాంఛనాలు అందుకునేది ఒక్క సీతా రాముల కళ్యాణమే.

భానుడు నిప్పులు కురిపించేవేళ, కొత్త తాటాకులు, మావిడాకుల వాసనలు, మల్లెల గుబాళింపుల నడుమ కొలువు తీరిన దేవదేవుడు శ్రీ సీతారాముడు.

సీతా మాత మెడలో మూడు ముళ్ళు వేసే సుందర దృశ్యం చూడాలంటే ఎవరైనా భద్రాచలం పయనం కావాల్సిందే. వాడవాడలా సీతారామకళ్యాణాలు జరగవని కాదు,ఆ 'ఉత్సవమూర్తులు' భద్రాచలంలోనే వుంటాయి కాబట్టి, వాటితో జరిగే కళ్యాణం కాంచాలంటే, అక్కడికే వెళ్ళాలి. అయితే అందరికీ ఈ భాగ్యం సాధ్యమవుతుందా? అంటే-

'నీవుండేదా కొండపై, నాస్వామి నేనుండేదీనేలపై... ఏ లీల సేవింతునో, నిను ఏ పూల పూజింతునో' అని నిట్టూర్చడం చాలామంది వంతు అవుతుంది. ఈ వ్యవహారాన్ని గమనించి, రాష్ట్ర దేవాదాయ శాఖ, హిందూ ధర్మప్రచార పరిషత్‌ను ఏర్పాటుచేసింది.

రాష్ట్రంలోని ఎంపిక చేసిన పదకొండు దేవాలయాలకు చెందిన, విశిష్టత గలిగిన కార్యక్రమాలను, గుడి ప్రాంగణం నుంచి జనం మధ్యకు తీసుకువచ్చి, ఆయా ఆలయాల అర్చకులతోనే, శాస్త్రసమ్మతంగా, తు.చ. తప్పకుండా, కార్యక్రమాలు నిర్వహించడం విశేషం.

అది కూడా ఆయా ఆలయాల నుంచి తీసుకువచ్చిన పవిత్ర ఉత్సవమూర్తులతో.అందులో భాగంగానే భద్రగిరివాసుడైన శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతంగా జిల్లాలో సంచరించి భక్తులకు దర్శనమిస్తూ, ప్రచార రథంలో ఊరేగుతూ బెజవాడకు తరలివచ్చాడు.

విజయవాడ, సూర్యారావుపేటలో వున్న వేమూరి అనిల్, స్వాతి భవనంలో స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విజయనామ సంవత్సర కార్తీక శుద్ధ సప్తమీ శనివారం ది. 9.11.2013వ తేదీ అభిజిత్ లగ్నంలో అంగరంగ వైభోగంగా కళ్యాణం జరిపించుకున్నాడు.

## అందరివాడవయా

భక్తుల పాలిట కొంగు బంగారంలా నిలుస్తూ కోరిన కోర్కెలు తీర్చే భద్రాద్రి రాముడు తన ఇష్టసఖి సీతమ్మతో కలసి రావడం ఓ మహద్భాగ్యం. ఈ కళ్యాణం జరిగిన తీరుతెన్నులను, దీనికోసం జరిగిన భారీ ఏర్పాట్లను ఏమని వర్ణించాలి.

ఇటీవలి కాలంలో విజయవాడ నగరంలో ఇంత వైభవంగా జరిగిన కార్యక్రమం ఇదే కావచ్చు. తాను ఏం చేసినా ఓ ప్రత్యేకత, ఓ గుర్తింపు, ఓ పద్ధతి వుండా





లని తపించే వ్యక్తి శ్రీ వేమూరి బలరామ్.

తన స్వాతి అనిల్ బిల్డింగ్స్‌లో శ్రీరామ కళ్యాణం చేసే అవకాశం రావడం ఆయనకు అద్భుత ఆనందాన్నే ఇచ్చింది.

దేన్నైనా సవాలుగా తీసుకుని విజయం దిశగా నడిచిపోయే ఆయన దీనిని మాత్రం ఓ మహత్కార్యంగా తలదాల్చారు. తన ఇంట పెళ్ళిలా భావించారు.

ఎంత ఖర్చు, ఏమిటి అన్నది ఆలోచన లోకే రాలేదు. ఏంచేయాలి... ఎలా చేయాలి అన్నది ఒకటే తపన.

ఇంటి ముందు తాటాకు పందిళ్ళు కొలువుతీరాయి. ఆవరణ అంతా ఆధునిక పందిళ్ళు అమరాయి.

ప్రముఖులకు, పెద్దలకు, అభిమాను లకు, బంధుమిత్రులకు, అందంగా ముద్రిం చిన ఆహ్వాన పత్రికలు వెళ్ళాయి.

విజయవాడ జనానికి సాదర స్వాగతం అంటూ ప్రకటనలు వెలువడ్డాయి. వీరు రావాలి... వీరు వద్దు... అని లేదు. అందరూ ఆహ్వానితులే. వచ్చిన అందరికీ ఉదయవేళ అల్పా హారం ఆహ్లాదాన్నిచ్చింది.

వేలాదిమందికి సరిపడా ఆవరణ కనులనిండుగా కనిపించింది. సాక్షాత్తూ శ్రీ సీతారాముల కళ్యాణం కనుల ముందు సాక్షాత్కరించినట్లు అనిపించేలా, వేదిక సిద్ధమయింది.

అట్టహాసమైన సెట్టింగులు, వేదపండితుల మంత్రో చ్చారణ, మేళతాళాలు, ముత్యాల తలంబ్రాలు శ్రీరామ నామాన్ని పఠిస్తూ భక్తుల జయజయ ధ్వానాల నడుమ సీతమ్మ సిగ్గులొలికిస్తూ పెళ్ళిపీటలపైకిరాగా ఆ తల్లితో శ్రీరామచంద్రమూర్తి వేదికపై కొలువయ్యాడు.

'కొలువైన ఆయనను చూడ... చాలునా కన్నులు వేయి' అనుకోవడం భక్తుల వంతయింది.

## రామయ్య తండ్రి-సీతమ్మ తల్లి

**భా**రతావనిలో పౌరాణికంగా, చారిత్రకంగానూ అతి ప్రసిద్ధమైన దివ్యక్షేత్రం... భద్రాచల శ్రీరామ క్షేత్రం. ఎక్కడ గోదావరి తీరం భద్రాచలం. ఇక్కడి కృష్ణాతీరం విజయవాడ.

'గోదావరి తీరం మాది' అని రామదాసు దాసునిగా తానీషాకు తనను తాను పరిచయంచేసుకున్న రామ భద్రుడు సపరివార సమేతంగా కళ్యాణం కోసం కృష్ణా తీరం చేరుకున్నాడు.

చిత్రమేమిటంటే, సూర్యవంశపు రాజైన రాముడు విజయవాడ 'సూర్య'రావుపేటకు రావడం. భద్రాచలం నుంచి రాముడు విజయవాడకు వచ్చి 'విజయం'చేసి, జనం భక్తిని, అభిమానాలను గెల్చుకుని 'విజయ' రాముడైపోయాడు. అత్యంత శ్రావ్యంగా ఆలపించిన భక్తిగీతాలు వింటూ కాలం మరిచాడు.

విశ్వశాంతిని కాంక్షిస్తూ జరుగుతున్న శ్రీ సీతా రాములవారి కళ్యాణానికి విజయవాడ పురప్రజలతో పాటు, పెద్దలు, వ్యాపార వేత్తలు, అధికారులు, డాక్టర్లు, లాయర్లు ప్రముఖులు రావడం మొదలైంది.

వచ్చినవారు ఎవరైనా, ఎంతటివారైనా, రామచంద్ర ప్రభువు ముందు భక్తరేణువులే.

అందుకే సీతారాముల వేదిక ముందు నేలపై సుఖా సీనులయ్యారు. వైదిక కార్యక్రమ నిర్వాహకులు సగౌర వంగా కళ్యాణకర్తలు శ్రీ వేమూరి బలరామ్, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానం కార్యనిర్వ హణాధికారి శ్రీ ఎమ్.రఘునాథ్‌లకు పర్యవేట్టం చుట్టి కళ్యాణకార్యక్రమ నిర్వహణ సంకల్పం చేయించారు.

అనంతరం విష్వక్సేనపూజతో కార్యక్రమం ప్రారంభ మయింది. కేవలం సుస్వరయుక్తంగా, సంస్కృత మంత్రాలు వల్లెవేస్తూ, తమ పాటికి తాము కార్యక్రమం జరిపించుకుంటూ పరుగులెత్తలేదు భద్రాచల ప్రధాన అర్చకులు, వైదిక పండితులు ప్రతి విధి విధానం భక్తులకు వివరించారు.

కళ్యాణం విశిష్టత గురించి చెప్పారు. సీతారాముల గుణగణాలను వర్ణించారు. నడుమ ఆగమ సిద్ధాం తాల ప్రకారం జరిగే పూజాది తంతుల సమయంలో రామదాస కీర్తనలు వినిపించారు.

## కళ్యాణ వైభోగమే...

**స**ర్వలోక జగద్రక్షకుడైన భద్రాద్రిరాముడు కళ్యాణ మూర్తిగా దర్శనమిచ్చాడు. పక్కనే నునుసిగ్గు లొలు కుతూ కూర్చున్న సీతమ్మ తల్లి. విష్వక్సేన పూజ అనం తరం వధూవరులైన సీతారాములకు కంకణ ధారణ జరిపించారు. అక్కడి నుంచి విధివిధానాల ప్రకారం వివాహ కార్యక్రమం నిర్వహించారు.

## కదలివచ్చిన కౌసల్యతనయుడు

**శ్రీ**రామ బాణమే కాదు... శ్రీరామ రథం కూడా విశేషమైనదే. హిందూ ధర్మ పరిరక్షణ సమితి, రాష్ట్రం లోని 11 ప్రముఖ ఆలయాల్లో ఆయా దేవుళ్ళ రథా లను తయారుచేయించింది. వీటిలో వేటి విశిష్టత వాటిది. ఇక భద్రాచల శ్రీరామ రథం అత్యంత రమణీయంగా తయారైంది.




ఈ రథంకూడా స్వాతి ప్రాంగణంలో కొలువు తీరి భక్తులకు కనువిందుచేసింది.

రథం ముందు భక్తిపారవశ్యంతో గానం చేస్తున్న శ్రీరామదాసు కొలువై వుంటాడు. రథంచూస్తుంటే, భద్రాచల ఆలయాన్ని చూసిన అనుభూతి గుండె లను తాకుతుంది.రథం లోపల,తల్లి సీతమ్మతో కొలువైన తండ్రి రామయ్య కనిపిస్తాడు. పక్కనే సోదరుడు లక్ష్మణుడు.

అక్కడ...ఆ భద్రాచలం గర్భగుడిలో ఏవిధంగా దర్శనమిస్తాడో, ఆ కరుణామూర్తి ఇక్కడా, ఈ రథంలోనూ, అచ్చం అదేవిధంగా కనిపిస్తాడు.

భద్రాచల దేవస్థానం అర్చకస్వాములు భక్తు లకు తీర్థం, శటారు అనుగ్రహిస్తారు. ఇంక ఏమి కావలె... రామభక్తులకు... అటు దర్శనం...ఇటు కళ్యాణ సుదర్శనం. ◆

స్వామికి యజ్ఞోపవీతం, వధువుకు యోక్త బంధం అమర్చినప్పుడు భక్తులు భక్తిపార వశ్యంలో మునిగితేలారు.

సరిగ్గా సుముహూర్త సమయం వచ్చి, జీల కర్ర, బెల్లం కలిపిన మిశ్రమం వధూవరుల తలలపై వుంచినపుడు భక్తులంతా తమ తమ ఇంట పెళ్ళి తంతు జరుగుతున్నంతగా లీనమై పోయారు. ఇది తామే, తమ వారికి చేస్తున్న పెళ్ళి అన్నంతగా పరవశులైపోయారు.

ఆపై మంగళసూత్రధారణ, తలంబ్రాలు కార్యక్రమాలు నిర్వహించే దశలో వారు మరింత భక్తి భావాలకు లోనయ్యారు.

మానవ జీవన వికాసానికి హేతువైన, మాంగల్య తంతుకదా మరి. అందుకేనేమో... 'మాంగల్యం తంతు...నానేనా... మమ జీవన హేతునా...' అంటూ మంత్రోచ్ఛరణ. కానీ ఇక్కడ మమజీవన హేతునా కాదు, లోక జీవనహేతునా అని చెప్పుకోవాలి.

ఎందుకంటే రామకళ్యాణం, లోక కళ్యాణం కదా! అర్చకస్వాములు, 'అమ్మా-నాన్న'లకు అందించే పూలహారాలు చేతబూని, ఆనంద నాట్యం చేసిన వేళ భక్తుల తన్మయత్వం వర్ణించడానికి అక్షరాలు చాలవు.

## జై శ్రీరామ్

**భ**క్తులు సైతం తలలాడిస్తూ, తప్పట్లు కొడుతూ, ఆ కార్యక్రమంలో భాగస్వాములైన వైనం ఓ అద్భుత దృశ్యం. "సీతా మనోనాయకమ్. భద్రాద్రి రామ ప్రభో" అంటూ భక్తులు రామభక్తి రసామృతాన్ని ఆస్వాదించారు. సీతమ్మకు రామదాసు చేయించిన చింతాకు పతకం,రామయ్యకుచేయించిన పచ్చల పత కం, ఇలా నగలన్నీ జగములేలే జననీజనకులకు అమ ర్చుతుంటే, జనం కనులార్పడం మరచిపోయారు.

అపార కరుణాసముద్రుడు, శతపత్ర నేత్రుడుగా భక్తుల మనోఫలకాల్లో కొలువైన భద్రాద్రి రాముడి కళ్యాణం అత్యంత కమనీయం.

అత్యంత వైభవంగా జరిగిన సీతారాముల కళ్యా ణంతో బెజవాడ, భద్రగిరిని తలపించింది.

**"భద్రాద్రి నిలయం రామం నత్వాపాపైః ప్రము చ్యతే"** (భద్రాచల నిలయుడైన శ్రీరాముని సేవించిన వారు సకలపాప విముక్తులై తరించెదరు) విజయవాడ స్వాతి అనిల్ బిల్డింగ్స్‌లో జరిగిన శ్రీ సీతారాములవారి కళ్యాణాన్ని చూసినవారంతా అలాగే తరించారు.

## మహిత మంగళమ్

**ఒ**కరా ఇద్దరా, అనిల్ బిల్డింగ్స్, 'స్వాతి' ఆవరణలో జరిగిన రామచంద్రప్రభువు వివాహానికి విచ్చేసిన జనం వేలాదిమంది అయినా అందరికీ ప్రసాదాలు అందాయి. పులిహోర, లడ్డు, చక్కెరపొంగలి, కళ్యాణ తలంబ్రాలు, శ్రీరామచంద్ర ముద్ర, కమ్మని పానకం, మొత్తం ఆరు రకాలు.

ఆరు ఋతువులు అనుభవించకుండా ఏడాది గడవదు. ఈ ఆరు రకాలు అందని భక్తుడే లేడు. హాజరైన అందరికీ, ప్రతి ఒక్కరికీ. ఇందుకోసం నియమితులైన స్వాతి సిబ్బంది ఉన్నా, భక్తులు కూడా స్వచ్ఛందంగా తమ వంతు సాయం అందించడానికి ముందుకు రావడం విశేషం.

అంతమంది సాయంపట్టినా, జనం బారులు తీరి నిలబడాల్సి వచ్చిందంటే, హాజరైన భక్తుల సంఖ్యను అంచనావేసుకోవచ్చు. ప్రసాదాలు తీసుకుని వెళ్ళిపో దామనుకున్న వారిని 'స్వాతి' యాజమాన్యం నిలువ రించింది. పెళ్ళికి వచ్చి భోజనాలు చేయకుండా ఇళ్ళకు వెళ్ళొద్దని కోరింది.

ఒకరా ఇద్దరా... వేలాదిమంది. అయినా అందరికీ అన్నప్రసాదం. అలా అని, ఒకటి రెండు కాదు, పంచ భక్ష్యాలు... కాదు, అంతకన్నా ఎక్కువ సంఖ్యలోనే పదార్థాలు చవులూరించాయి.

జనానికి దేవదేవుని కళ్యాణం చూసిన ఆనందం ఒక పక్క, స్వామి ప్రసాదం అందిన సంతోషం మరో పక్క, షడ్రసోపేత విందు స్వీకరించిన వైభవం ఇంకో పక్క ముప్పిరికొనగా, పదికాలాలకు ఆ అనుభవాన్ని పలవరించుకోవాలనుకుంటూ ఇళ్ళదారి పట్టారు.

ఇలా జరిగింది స్వాతి అనిల్ బిల్డింగ్స్‌లో అనిల్ రాముని శ్రీ సీతారాముల కళ్యాణం. నరుడై పుట్టిన పురుషోత్తముని కళ్యాణం. ఇది 'చూచువారలకు చూడ ముచ్చట... పుణ్యపురుషులకు ధన్యభాగ్యం, భక్తియుక్తు లకు ముక్తిప్రదం' ఇది విజయవాడకు చెందిన 'సజ్జన కోటి'కి దక్కిన అరుదైన అవకాశం.

**రామచంద్రాయ జనకరాజయా మనోహరాయ**
**మామకాభీష్టదాయ మహిత మంగళమ్**

**కోసలేశాయ మందహాస దాస పోషణాయ**
**వాసవాది వినుత సత్వరాయ మంగళమ్**

**విమలరూపాయ వివిధ వేదాంత వేద్యాయ**
**సుముఖ చిత్రకామితాయ శుభ్రమంగళమ్**

**రామదాసాయ మృదుల హృదయ కమలవాసాయ**
**స్వామి భద్రగిరివరాయ సర్వమంగళమ్**

**- వి. రాజా**



## 'బహుబల'రామ్

**రా**ముడు దేవుడు. అందుకే ఎందరో తమ బిడ్డ లకు ఆయన పేరు పెట్టుకుంటారు.

రాముడి పేరు పెట్టుకుంటే బలం వస్తుందేమో? బలం వస్తే, బలరాముడైపోతారేమో? శ్రీ వేమూరి బలరామ్ కూడా అంతే. కానీ ఆయన కేవలం బలరామ్ మాత్రమే కాదు... 'బహుబల'రామ్.

సత్సంకల్పం ఆయన బలం. సుశిక్షితులైన 'స్వాతి' సిబ్బంది మరో బలం. దేనికీ వెనుకాడని నైజం ఇంకో బలం. అన్నింటికీ మించి అఖిలాంధ్ర పాఠకలోకం 'స్వాతి' వెన్నంటి వుందన్న సత్యం మరింత బలం. ఇలా 'బహుబల' రాముడాయన.

'స్వాతి' ఆ పేరు అంటేనే ఆయనకు పర వశం... 'స్వాతి'ని సదా తన ముద్దుబిడ్డగా భావించి, అహర్నిశం స్వాతి క్షేమం, స్వాతి ప్రగతి కోసమే రోజుకు పన్నెండు నుంచి పద్దెనిమిది గంటలు శ్రమించే వ్యక్తి 'స్వాతి' బలరామ్. ఆయనకు 'స్వాతే' సర్వస్వం. అహరహం అదే తపన.

అలాంటి వ్యక్తి, తన 'స్వాతి' ఆవరణలో 'శ్రీరామ కళ్యాణం' అనేసరికి భద్రాచలం కొండంతయి పోయారు. పరుగులే పెట్టారు.

అందమైన ఆహ్వానపత్రిక దగ్గరనుంచి ఆహూ తులకు అందివ్వాల్సిన ఆహారపదార్థాల వరకు అన్నీ శ్రీబలరామ్ తన సంతృప్తిమేరకు స్వయంగా ఆలోచించి, నిర్ణయించుకున్నారు. పురమాయిం చుకున్నారు, పర్యవేక్షించుకున్నారు.

**ఆ**యన ఆదేశాలమేరకు అనుక్షణం అందు బాటులో ఉంటూ, బల'రామాజ్ఞ'ను పాటించడం స్వాతి సిబ్బంది కర్తవ్యమైంది. వారు సైతం ఇది తమ ఇంటిపెళ్ళిలా భావించారు. వచ్చినవారు పెద్దలా, పిన్నలా, మాన్యులా, సామాన్యులా అన్నది చూడనే లేదు. ప్రతి ఒక్కరికీ నీళ్ళు, అల్పాహారం, ప్రసాదం, భోజనం అన్నీ అందుతున్నాయా లేదా అన్నది ఒక్కటే తపన.

ఇంతమంది ఒక్క ఆవరణలో చేరినా, భక్తి పారవశ్యం తప్ప, వేరే అలజడి లేదు. అంతమంది ఒక్కసారి భోజనాలకు దిగినా తొక్కిడి లేదు.

శ్రీ బలరామ్ ముఖంలో అలసటలేదు. వచ్చిన ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో పలకరిస్తూనేవున్నారు. మరోపక్క ఏర్పాట్లను పర్యవేక్షిస్తూనే ఉన్నారు.

అయితే వచ్చినవారందరికీ ఒకటే సందేహం. ఇక్కడ జరుగుతున్నది రామకళ్యాణమా? లేక 'బలరామ్'ని ఇంటి కళ్యాణమా? అన్నదే. ◆